సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 6 | డిసెంబర్ | 2023



సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ తెలిపారు.

- 8లో



దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ

దివ్యాంగుల సేవ విశ్వమానవ సేవ అని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ రాష్ట్ర వైస్‌చైర్‌పర్సన్ డాక్టర్ అనితారెడ్డి అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
$23^0/21^0$

వాతావరణం

మిచాంగ్ తుపాను కారణంగా జిల్లాలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. రాత్రి చలి తీవ్రత కూడా ఎక్కువగా ఉంటుంది.

7 తర్వాతే జిల్లాకు..

సీఎంగా రేవంత్ ప్రమాణ స్వీకారం అనంతరం రానున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

- హోటల్ 'ఎల్లా'లో మకాం.. జిల్లాకు వచ్చాక గెలుపు సంబురాలు
- ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు
- అంతర్మథనంలో పడిన నేతలు, శ్రేణులు
- ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో ఒక్కసారిగా స్తబ్ధత



సాక్షిప్రతినిధి, వరంగల్:

సుమారు 30 రోజులపాటు రాజకీయ సందడిగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక్కసారిగా స్తబ్ధత ఏర్పడింది. నవంబర్ 30న సార్వత్రిక ఎన్నికల పోలింగ్.. ఈ నెల 3న ఓట్ల లెక్కింపు జరిగింది. మొత్తం 12 అసెంబ్లీ స్థానాలకు 10 చోట్ల కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. రెండు చోట్ల బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. ప్రతిసారి ఎన్నికల ఫలితాల తర్వాత గెలిచిన అభ్యర్థులు సంబురాలు, ఓటమి చెందిన వారు సమీక్షలు చేసుకోవడం ఆనవాయితీ. ఈసారి పరిస్థితులు భిన్నంగా మారాయి. మూడోసారి ప్రభుత్వం ఏర్పడుతుందనుకుంటే ఘోర పరాజయం కావడంతో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జీర్ణించుకోవడం లేదు. మరోవైపు పదిచోట్ల గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కౌంటింగ్ కేంద్రాల నుంచి నేరుగా హైదరాబాద్ 'ఎల్లా' హోటల్‌కు తరలి సంబురాలకు దూరంగా ఉన్నారు. మంగళవారం సాయంత్రం సీఎల్పీ నేత, సీఎంగా రేవంత్‌రెడ్డి పేరు ఖరారు కావడం.. 7న ప్రమాణ స్వీకారానికి ముహూర్తం కుదరగా.. ఆ తర్వాతే కొత్త ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు చేరనున్నారు. నియోజకవర్గాల్లో పెద్దఎత్తున విజయోత్సవాలకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కార్యాచరణ సిద్ధం చేస్తుండగా... ఓటమికి కారణాలపై 'పోస్టుమార్టం' నిర్వహించే పనిలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆలస్యమైనా.. కాంగ్రెస్‌కు కలిసొచ్చిన విజయం...

ఉమ్మడి వరంగల్‌లో 12 స్థానాలకు 10 గెలుచుకున్న కాంగ్రెస్ పార్టీ మరోసారి తనకు తిరుగులేదని నిరూపించింది. నామినేషన్లకు తెరలేచే సమయానికి కాంగ్రెస్ అభ్యర్థులు నలుగురు మాత్రమే ఖరారయ్యారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ధనసరి సీతక్క (ములుగు)తోపాటు గండ్ర సత్యనారాయణరావు (భూపాలపల్లి), దొంతి మాధవరెడ్డి (నర్సంపేట), శనిగపురం ఇందిర (స్టేషన్‌ఘన్‌పూర్) పేర్లు తొలి జాబితాలో వెలువడ్డాయి. మిగిలినచోట్ల ఆశావహులు అధికంగా ఉండడంతో ఎనిమిది మంది అభ్యర్థుల ఎంపిక ఆలస్యమైంది. ఓవైపు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంటే.. కాంగ్రెస్ వెనుకబడినట్లే కనిపించింది. పార్టీ అంతర్గత సర్వేల ఆధారంగా అభ్యర్థులను ప్రకటించడం, అసమ్మతి నేతలను పార్టీ పెద్దలు బుజ్జగించటం, ఆరు జిల్లాల ముఖ్యనేతలు సమన్వయంతో వ్యవహరించి కాంగ్రెస్ శ్రేణులు ఎన్నికల బరిలోకి దూకాయి. 20 రోజుల్లోనే పక్కా కార్యాచరణతో ప్రచారం నిర్వహించాయి. ఏఐసీసీ పరిశీలకులుగా నియమితులైన రవీంద్ర ఉత్తమ్‌రావు దళ్వీ, మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి వరంగల్‌పై ప్రత్యేక దృష్టి సారించి వ్యూహాత్మకంగా ప్రచారం నిర్వహించారు. అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ ప్రచారం ఉమ్మడి జిల్లాలో పార్టీకి కలిసివచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకతకు తోడు సంప్రదాయ ఓటుబ్యాంకు దన్నుగా నిలిచింది. ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించడంతో పార్టీకి అనుకూల పవనాలు వీచాయి. ఈసారి మార్పు కావాలని ప్రజలు నిర్ణయించుకోవడంతో కాంగ్రెస్‌కు ఒక్కచోట మినహా మిగతా స్థానాల్లో భారీ ఆధిక్యాలు దక్కాయి. ఉమ్మడి జిల్లాల్లో పది స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలవడంతో కేడర్‌లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. అధికారానికి పదేళ్ల దూరంగా ఉన్న నాయకులు, కార్యకర్తల్లో జోష్ వచ్చింది.

బీఆర్ఎస్ ఓటమికి కారణాలెన్నో..

ఆరు జిల్లాల్లో ఎన్నికల ఫలితాలు ఈసారి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు తీవ్ర నిరాశ కలిగించాయి. 2018 ఎన్నికల్లో 12 స్థానాలకు 10 చోట్ల గెలిచిన బీఆర్ఎస్, ఈసారి రెండు స్థానాలకే పరిమితమైంది. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి (భూపాలపల్లి)ని పార్టీలో చేర్చుకోవడంతో తాజా ఎన్నికలకు వెళ్లే సమయానికి బీఆర్ఎస్‌కు 11 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లను మార్చి మిగిలిన అందరికీ సీట్లు ఇచ్చింది. అభివృద్ధి నినాదంతో బీఆర్ఎస్ అభ్యర్థులు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లారు. ప్రచార పర్వంలో భాగంగా ఒక్కో గ్రామాన్ని కనీసం రెండుసార్లు చుట్టేశారు. కేసీఆర్ బహిరంగ సభలు, కేటీఆర్, హరీశ్‌రావు రోడ్‌షోలు నిర్వహించినా ఓటర్ల మనసు మాత్రం గెలుచుకోలేకపోయారు. పార్టీకి అన్నీ తామై ముందుకు నడిపించాల్సిన ముఖ్య నాయకులు 'ఎవరికివారే యమునా తీరే అన్నట్లు' వ్యవహరించడం, ప్రచారం, ఎన్నికల వ్యూహరచనలో సమన్వయం లోపించడంతో బీఆర్ఎస్ కుదేలైంది. కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చాల్సిందేనని స్థానికంగా డిమాండ్లు వెల్లువెత్తినా, అసమ్మతులు చెలరేగినా పార్టీ అధిష్టానం పట్టించుకోలేదు. పలు నియోజకవర్గాల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వలేదంటూ కొందరు నేతలు పార్టీని వీడగా.. కొన్నిచోట్ల పార్టీలో ఉంటూనే సిట్టింగ్ అభ్యర్థుల ఓటమిని కోరుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో అక్కడక్కడ ప్రజాప్రతినిధులపై ఆరోపణలు, ప్రభుత్వ పథకాల అమలులో లోపాలు కూడా ప్రతిబంధకంగా మారాయి. మరికొన్ని చోట్ల అభ్యర్థులపై సానుకూలత ఉన్నప్పటికీ.. స్థానిక పరిస్థితులకు తోడు కాంగ్రెస్ గాలి వీచడంతో కారు ఓటమిని చవిచూసింది. మొత్తంగా అతివిశ్వాసంతో ఓటర్ల మనసు గెలుచుకోలేకపోయిన బీఆర్ఎస్ ఈసారి రెండు స్థానాలకే పరిమితమైందని, అదీ.. 'సిట్టింగ్'లను మార్చిన ఫలితమేనని ఆ పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

సంపత్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, కడియం, పల్లా



సంపత్‌కు కన్నీటి వీడ్కోలు

- వివరాలు 8లో

గుండెపోటుతో మరణించిన జనగామ జెడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డికి పార్టీ అభిమానులు, నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. సంపత్‌రెడ్డి భౌతికకాయాన్ని తన స్వగ్రామమైన చిల్పూరు మండలం రాజవరం గ్రామానికి తరలించగా, మంగళవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. - చిల్పూరు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- నగర మేయర్ గుండు సుధారాణి
- 34వ డివిజన్‌లో డ్రెయినేజీ పరిశీలన

వరంగల్ అర్బన్ : భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. గ్రేటర్ 34వ డివిజన్ శివనగర్‌లోని పల్లవి హాస్పిటల్ వద్ద కొనసాగుతున్న డ్రెయినేజీ పనులను మంగళవారం మేయర్ పరిశీలించి ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ వరంగల్ నగరానికి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో నీరు సులువుగా వెళ్లడానికి వీలుగా డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కాల్వల్లో చెత్త తొలగించేలా చూడాలని ముఖ్య ఆరోగ్య అధికారిని మేయర్ ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల సమన్వయంతో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించి, పనులు కొనసాగించాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న నగర మేయర్ గుండు సుధారాణి

న్యూస్‌రీల్

జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు కౌశిక్



విద్యారణ్యపురి : హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌లో హనుమకొండ జిల్లాకు చెందిన విద్యార్థి కాసుకీర్తి కౌశిక్ ప్రతిభ కనబరిచాడు. తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల సైన్స్ కాంగ్రెస్‌లో పెంబర్తిలోని ఏకశిల హైస్కూల్ విద్యార్థి కౌశిక్ అంధులకు మూడో నేత్రం అనే ప్రాజెక్టును రూపొందించగా జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక చేశారు. సభ్య కార్యదర్శి డాక్టర్ మారపాక నగేష్, నైపర్ జామియా హందర్ద్ యూనివర్సిటీ వీసీ అహ్మద్ కమల్, పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకురాలు ప్రొఫెసర్ విజయలక్ష్మి చేతుల మీదుగా కౌశిక్ బహుమతులు, సర్టిఫికెట్ అందుకున్నాడు. కౌశిక్ ఓపెన్ కేటగిరీలో ఎంపిక కావడంతో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, జిల్లా సైన్స్ అధికారి ఎస్. శ్రీనివాసస్వామి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ అభినందించారు.

వరంగల్‌లో విద్యార్థిని బ్రాహ్మణి..

కాశీబుగ్గ సెంటర్ : వరంగల్ శివనగర్‌కు చెందిన ఏకశిల హైస్కూల్ విద్యార్థిని బ్రాహ్మణి జాతీయస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపికైందని డీఈఓ వాసంతి తెలిపారు.

కేయూ డిగ్రీ పరీక్షల ఫీజు గడువు ఈనెల 6

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ, బీసీఏ తదితర కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫీజు చెల్లించే గడువు ఈనెల 6 వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 8 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు.

పోలీసుల పనితీరు అభినందనీయం

సీపీ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం : సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఈ మేరకు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందికి సీపీ మంగళవారం ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శ్రమించిన అధికారులు, సిబ్బంది తీరు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయడం ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభమైందని సీపీ తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ టాస్క్‌ఫోర్స్, సీసీఆర్‌బీ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, మధుసూదన్, కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'పశ్చిమ' ప్రజలకు కృతజ్ఞతలు

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హన్మకొండ: తనను శాసన సభ్యుడిగా గెలిపించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తాను నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. త్వరలో నియోజకవర్గంలోని ప్రతి ఓటరును కలుస్తానని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ : వరంగల్ జిల్లాలోని 76 ప్రభుత్వ పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కింద విద్యార్థులకు కరాటే నేర్పించేందుకు కరాటే మాస్టర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్ఓ సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరాటేకు చెందిన అర్హతలతోపాటు శిక్షణలో ఇదివరకు ఉన్న అనుభవం, విద్యార్హతలు, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌తో ఈనెల 14 సాయంత్రం 5 గంటల వరకు ఓ సిటీలోని జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు

ఎంజీఎం : మానసిక ఒత్తిడి, వ్యసనాలు, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి వైద్యాధికారులు, వైద్యసిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే బృందాలు, వైద్య సిబ్బందికి మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ సాంబశివరావు మాట్లాడుతూ మానసిక రుగ్మతలపై సలహాలు అవసరముంటే హసన్‌పర్తి ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ప్రహాసిత్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం డాక్టర్ ప్రహాసిత్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సిగరేట్, గంజాయి, ఆల్కాహాల్, మత్తు పదార్థాల వల్ల చాలా మంది వ్యసనాలకు గురవుతున్నారని వివరించారు. టీనేజ్ పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమశ్రీ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్ : పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలని, లక్ష్యాన్ని చేరుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్‌రిజ్వాన్ బాషా హెచ్చరించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆస్తి, నీటిపన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై మంగళవారం వేర్వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను రూ.99.60 కోట్ల లక్ష్యం కాగా.. ఇప్పటివరకు రూ.37.52 కోట్లు వసూలు చేశారని తెలిపారు. మిగిలిన పన్నులను ప్రణాళికాబద్ధంగా వసూలు చేయాలన్నారు. సర్కిళ్ల వారీగా గృహాలు, పన్నుల సేకరణ, పెండింగ్, కమర్షియల్, నాన్ కమర్షియల్ వివరాలు ప్రతి బిల్‌కలెక్టర్ వద్ద ఉండాలని ఆదేశించారు. ప్రస్తుతం 37 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయని, ఆర్‌ఐలకు లక్ష్యాన్ని విధిస్తామని తెలిపారు. జనవరి 5 నాటికి కనీసం 65 శాతం సేకరించాలని చెప్పారు. బడా బకాయిదారులను 100 మంది చొప్పున గుర్తించి నోటీసులు జారీ చేసి వసూలు చేయాలన్నారు. ఇళ్ల పేరు మార్పిడి, కొత్త గృహాలకు నంబర్ల కేటాయింపు, రివైజ్డ్ ఫైళ్లు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. సిటిజన్ చార్టర్‌ను పటిష్టంగా అమలుచేసే విధంగా డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షించాలని సూచించారు. సమీక్షలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, కృష్ణారెడ్డి, ఆర్‌ఓలు, ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా

ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే సీజ్ చేయండి

ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, చెల్లించకుంటే మునిసిపల్ చట్టంలోని సెక్షన్–264 ప్రకారం షాపులను సీజ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. సెక్షన్ 269 ప్రకారం 6 నెలల జైలుశిక్ష కూడా విధించేందుకు ఆస్కారం ఉంటుందని గుర్తించాలని సూచించారు. నగర వ్యాప్తంగా 31,482 ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రూ.9 కోట్ల 60 లక్షలు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు రూ.2 కోట్ల 50 లక్షలు వసూలయ్యాయని తెలిపారు. అధిక బకాయిలున్న ట్రేడ్‌ల వసూళ్లే లక్ష్యంగా రూట్‌మ్యాప్ సిద్ధం చేసి వసూళ్లు చేయాలన్నారు. ఈనెల 20 వరకు కార్పొరేటర్ల సమన్వయంతో శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. జీపీఎస్ అమర్చిన వాహనాలు, మరమ్మతుల వివరాలు సమర్పించాలన్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ సక్రమంగా జరిగేలా హెల్త్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, ముఖ్య ఆరోగ్యాధికారి రాజేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ చిహ్నాల పరిశీలన

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులకు సంబంధించిన చిహ్నాల (ఎంబ్లమ్స్)ను కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా బల్దియా ప్రధాన కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనుల పురోగతి, కొనసాగుతున్న, పూర్తయిన పనులకు సంబంధించి చిహ్నాలను తిలకించి పలు సూచనలు చేశారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ల్లోని సుమారు 500 ప్రాంతాల్లో వీటిని ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ సంజయ్‌కుమార్, డీఈ రవికుమార్, స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు ఉన్నారు.

'మిచాంగ్'తో రైతుల ఆందోళన



పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పిన రైతులు

- పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం
- కాంటాలు ప్రారంభం కాకపోవడంతో అన్నదాతలకు నష్టం

పరకాల : మిచాంగ్ తుపాను ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నేలవాలింది. మార్కెట్ యార్డుల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయి అన్నదాతలు నష్టపోయారు. పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన వందల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయ్యింది. కాంటాలు ప్రారంభం కాకపోవడంతో వర్షానికి ధాన్యం తడిసిపోయిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పత్తి, మిర్చి పంటలకు సైతం తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

హనుమకొండ జిల్లాలో తేలికపాటి వర్షం

హన్మకొండ : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాన్ తుపాన్ ప్రభావంతో హనుమకొండ జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం కురిసింది. మరోమూడు రోజులపాటు తుపాన్ ప్రభావం ఉంటుందని, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దామెర మండలం పులుకుర్తిలో 12 మిల్లీమీటర్లు, దామెరలో 10.8, కమలాపూర్‌లో 10, హసన్‌పర్తి నాగారంలో 9.8, శాయంపేటలో 9.8, ఐనవోలులో 9.5, నడికూడలో 7.5, ఐనవోలు మండలం కొండపర్తిలో 5.5, ఎల్కతుర్తిలో 4.8, పరకాలలో 4.5, ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాలలో 4, భీమదేవరపల్లిలో 3.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి



స్కాలర్స్ బ్యాడ్మింటన్ లీగ్-23 ప్రారంభోత్సవంలో డీన్ శ్రీనివాసాచార్య, స్కాలర్స్

కాజీపేట అర్బన్ : విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ శ్రీనివాసాచార్య సూచించారు. నిట్ ఇండోర్ స్టేడియంలో నిట్ స్కాలర్స్ బ్యాడ్మింటన్ లీగ్ -23 పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో పీహెచ్‌డీ స్కాలర్స్‌కు ఐదు రోజులపాటు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్కాలర్స్ బ్యాడ్మింటన్ లీగ్-23లో ఆరు జట్లు పాల్గొంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు అబ్దుల్ అజీం, ప్రశాంత్, సుభాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల్లోకి తీసుకురావాలి



అవార్డులు అందుకున్న ఆర్టీసీ ఉద్యోగులతో ఆర్‌ఎం జాస్తి శ్రీలత

- వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత
- ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డుల ప్రదానం

హన్మకొండ : ప్రజా రవాణ సంస్థ టీఎస్ ఆర్టీసీని మరింత లాభాల్లోకి తీసుకురావాలని వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత సూచించారు. హనుమకొండలోని వరంగల్-1 డిపోలో ఉద్యోగులకు మంగళవారం ప్రగతి చక్రం అవార్డులను ప్రదానం చేశారు. వరంగల్ రీజియన్‌లో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ త్రైమాసికంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఆర్‌ఎం శ్రీలత నగదు అవార్డులు, ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం మాట్లాడుతూ ఉద్యోగులందరు కష్టపడి పనిచేస్తున్నారని, దసరా, దీపావళి, ఎన్నికల సందర్భంగా ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేశారన్నారు. ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఆమె కొనియాడారు. మున్ముందు ఇదే అంకితభావంతో పని చేసి వరంగల్ రీజియన్‌లోని డిపోలను లాభాల్లోకి తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు మాధవరావు, కేశరాజు భానుకిరణ్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కూనంనేని సాంబశివరావుకు సీపీఐ నేతల అభినందనలు

న్యూశాయంపేట : కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావును మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ హనుమకొండ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదిరి శ్రీనివాస్, నాయకులు తోట భిక్షపతి, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కూనంనేని సాంబశివరావుకు పుష్పగుచ్ఛం అందించి అభినందిస్తున్న నాయకులు

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ లీకేజీ



కమలాపూర్ : మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన శనిగరపు రమేశ్ ఇంట్లో మంగళవారం ఉదయం వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీకై ంది. దీంతో మంటలు చెలరేగి ఇల్లంతా వ్యాపించాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యులతో పాటు కాలనీవాసులు భయాందోళనలకు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే సంబంధిత గ్యాస్ కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేస్తుండగానే, కొందరు యువకులు చాకచక్యంగా వ్యవహరించి గ్యాస్ ఆఫ్ చేసి సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కాగా, పెనుప్రమాదం తప్పిందని రమేశ్ కుటుంబ సభ్యులతో పాటు కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని ఫ్రిజ్, మిక్సీ, బియ్యం, నిత్యావసర వస్తువులు దగ్ధమై సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధిత కుటుంబీకులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రమేశ్ కుటుంబాన్ని ఆదుకుని అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న రాజశేఖర్

హన్మకొండ అర్బన్ : క్రీడలతో దివ్యాంగ విద్యార్థుల్లో ఉత్సాహం, మానసికోల్లాసం పెంపొందుతుందని భారత్ స్పెషల్ ఒలింపిక్ తెలంగాణ ప్రాంత సభ్యుడు సి.రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మల్లికాంబ మనోవికాస కేంద్రం అధ్వర్యంలో నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన యూనిఫైడ్ స్పోర్ట్స్‌ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో సృజనాత్మకత, మనోధైర్యం పెంపొందుతాయన్నారు. దివ్యాంగ విద్యార్థులకు రన్నింగ్, షాట్‌పుట్, సాఫ్ట్ బాల్, చెస్, క్యారమ్, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పాక వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ పద్మ, కళ్యాణ్, సదానందం పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి టౌన్: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మల్లంపల్లిలో జరిగింది. మల్లంపల్లికి చెందని గీత కార్మికుడు కోతి కిష్టయ్య మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి మోకు జారి పడ్డాడు. వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు.



పంటలను కాపాడుకోండిలా..

- మిచాంగ్ తుపాన్‌తో పంటలకు నష్టం
- యాజమాన్య పద్ధతులు పాటించాలి

కరీమాబాద్ : ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని పంటలు సాగుచేస్తున్న రైతులకు తుపాన్ ఆందోళనకు గురిచేస్తుంది. సాగు చేసిన పంటలు చేతికొస్తున్న తరుణంలో 'మిచాంగ్' రూపంలో వస్తున్న తుపాన్ తీవ్ర నష్టాన్ని మిగిల్చే పరిస్థితులు కనిపిస్తుండడంతో రైతులలో కలవరం నెలకొంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వరి కోత దశలో ఉండగా కొన్నిచోట్ల పూర్తై ధాన్యం కుప్పలు పోసిన సందర్భాలున్నాయి. కూలీల కొరతతో పత్తి మొక్కలపైనే ఉండగా మిరప పంట కాత దశలో ఉంది. ఈ నేపథ్యంలో తుపాన్ విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకుంటూ యాజమాన్య పద్ధతులు పాటించకపోతే తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం కనిపిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- తడిసిన పత్తిని తీయకుండా ఎండిన తర్వాతనే ఏరాలి. ప్లాస్టిక్ పట్టాలపై మండెలుగా వేసి రెండు, మూడు రోజులు ఆరబెట్టాలి. ఇలా చేయడం వల్ల పత్తిలో తేమశాతం తగ్గి గింజ గట్టిపడి శుభ్రంగా ఉంటుంది.
- ఎనిమిది శాతం తేమ ఉన్న పత్తిని గోనె సంచులలో తొక్కి తేమ తగలని చోట నిల్వ చేయాలి. దీంతో పత్తి రంగు మారకుండా ఉండి ధర ఎక్కువ వచ్చే అవకాశముంటుంది.

వరి పంటలో..

వర్షంలో తడిసిన గింజలు రంగు మారడం, సరిగా మొలకెత్తకపోవడం, మిల్లింగ్‌లో ఎక్కువ నూకలు



రావడం, నాణ్యత తగ్గడంతోపాటు రేటు కూడా తగ్గుతుంది.

- నీరు నిలిచిన చోట కాల్వలు తీసి నీటిని బయటికి పంపాలి.
- ఒక వేళ వర్షం ఎక్కువై నీరు నిల్వ ఉంటే నాలుగైదు దుబ్బులు కలిపి నిలబెట్టి కట్టలా కట్టాలి. దీంతో వరి దుబ్బులు కింద పడకుండా ఉంటాయి.
- లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేసుకోవాలి. గింజ రంగు మారడం తగ్గి మొలకెత్తకుండా ఉంటాయి.

మిరప పంటలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ప్రస్తుతం మిరప పంట కాయ దశలో ఉంది. మబ్బుతో కూడిన వాతావరణం వల్ల మిరప పంటలో ఎక్కువగా 'వడలు' తెగులు ఆశించే అవకాశం ఉంది. వర్షాలు అలాగే కురిస్తే 'కాయ కుళ్లు' తెగులు, 'కొమ్మ ఎండు' తెగులు ఉధృతి పెరిగే అవకాశం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- లీటరు నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రాము కార్బండీజం కలుపుకుని మొక్కల మొదట్లో పోయడం వల్ల ఎండు తెగులు తగ్గుతుంది.
- కొమ్మ ఎండు తెగులు ఆశించినట్లయితే దాని నివారణకు లీటరు నీటిలో ఒక గ్రాము ప్రొపికనజోల్, డైఫెన్కజోల్, కాపర్ ఆక్సీక్లోరైడ్, కార్బండీజం, మాంకోజెబ్ లాంటి మందులు మోతాదు ప్రకారం మార్చి మార్చి పిచికారీ చేయాలి.
- బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించినట్లయితే నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్, స్ట్రెప్టోసైక్లిన్ లాంటి మందులు కలిపి పిచికారీ చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



పంటలు చేతికొస్తున్నందున తుపాన్‌తో రైతులు అప్రమత్తంగా ఉండాలి. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షం తగ్గిన తర్వాత మొక్కలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి. అవసరమైతే పంటల వద్దకు తీసుకువెళ్లి వారి సలహాలు, సూచనల మేరకు మోతాదు ప్రకారం మందులు పిచికారీ చేయాలి.

– డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

నిరంకుశ పాలనపై ప్రజా విజయం

- కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలి
- టీ పీపుల్స్ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ వెంకట నారాయణ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వెంకటనారాయణ

హన్మకొండ : అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ నిరంకుశ పాలనపై వచ్చిన తీర్పు ప్రజా విజయమని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ ప్రొఫెసర్ వెంకటనారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని స్వగృహంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో వెంకటనారాయణ మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లుగా అవలంభించిన విధానాల వల్ల ప్రజలు విసిగి కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతి, నిరంకుశ పాలనపై విద్యార్థి, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు నిరంతరం చేసిన ఉద్యమాల ఫలితమే ఈ ఓటమి అని పేర్కొన్నారు. తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్లు బి.రమాదేవి, జనగాం కుమార స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల కోసం ఏర్పాటు చేసిన టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల లీకేజీపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, తక్షణమే అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వ అవినీతి నిరంకుశ విధానాలను ప్రశ్నించిన ప్రజాసామిక వాదులపై, ప్రజా సంఘాల నాయకులపై ఉపా కేసును ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఇకముందు ఉపా చట్టాన్ని అమలు చేయకుండా ప్రజాస్వామిక వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జేఏసీ నాయకుడు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను చట్టబద్ధం చేసి అమలు చేస్తామని ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కాంపల్లి ప్రవీణ్, క్రాంతి, శరత్, రాజేందర్ పాల్గొన్నారు.

నేలను పరిరక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

కరీమాబాద్ : ప్రస్తుత పరిస్థితుల్లో నేలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న తెలిపారు. తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కేవీకేలో మంగళవారం ప్రపంచ 'నేల'ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడారు. నేలల పరిరక్షణలో భాగంగా భూమిని తక్కువగా దున్నడమే కాకుండా పంట మార్పిడి చేసి పప్పు దినుసులు, పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. ఈక్రమంలోనే నేల, నీరు, తేమకు సంబంధించిన ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడొద్దన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అరుణజ్యోతి, శశాంక్, సాయికిరణ్, గణేశ్, రైతులు, మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై విచారణ చేపట్టాలి

- కలెక్టర్‌ను ఆదేశించిన హైకోర్టు

ఏటూరునాగారం : పట్టాల్యాండ్ ఇసుక క్వారీ వద్ద స్థానిక సర్పంచ్ ఈసం రామ్మూర్తి గతేడాది మేలో గొడవకు దిగి డబ్బులు డిమాండ్ చేసినందుకు సంబంధిత ఇసుక కాంట్రాక్టర్ సుధీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్ పై విచారించిన కోర్టు సర్పంచ్ తన నేరాన్ని అంగీకరించారని అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో సర్పంచ్ రామ్మూర్తిపై నాలుగు వారాల్లో విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశాలిచ్చింది. ప్రజలతో కలిసి ధర్నా, ఆందోళన కార్యక్రమం చేపట్టడంతో పాటు రవాణాను అడ్డుకోవడం కాంట్రాక్టర్‌ను బెదిరించినందుకు ఈ ఏడాది సెప్టెంబర్‌లో ములుగు కోర్టులో జరిమానా చెల్లించారు.సర్పంచ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా నేరాన్ని అంగీకరించినట్లు తేలింది. దీంతో కోర్టు జిల్లా కలెక్టర్‌ను సర్పంచ్‌పై మరోమారు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



ఈసం రామ్మూర్తి

57 రోజుల్లో ముగియనున్న పదవీకాలం

కేవలం 57 రోజుల్లోనే ఆయన పదవి కాలం ముగియనుంది.దీంతో హైకోర్టు ఉత్తర్వులను జిల్లా అధికారులు విచారణ చేపట్టి పట్టాల్సి ఉంది. కరకట్ట ప్రమాదంలో ఉందని, ఇసుక తవ్వకాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ ఈసం రామ్మూర్తి తెలిపారు. ఎవరి వద్ద ఎలాంటి డబ్బులు అడగలేదని, తనపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. ఏటూరునాగారం పట్టాల్యాండ్ ఇసుక క్వారీపై విచారించి తహసీల్దార్ మైనింగ్ అధికారులకు నివేదిక అప్పగించాలని కోర్టు ద్వారా ఉత్తర్వులు వచ్చినట్లు సర్పంచ్ సాక్షికి వివరణ ఇచ్చారు.



ఏటూరునాగారం పంచాయతీ కార్యాలయం

అశ్రునయనాలతో సంపత్ రెడ్డి అంత్యక్రియలు



ఇంటి ఎదుట గుమిగూడిన నాయకులు, స్థానికులు

- పాడె మోసిన పల్లా, రాజయ్య
- పరామర్శించిన ఎమ్మెల్యేలు, నాయకులు

చిల్పూరు : జనగామ జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్ రెడ్డి(59) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. కాగా మంగళవారం సాయంత్రం పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు, అభిమానులు, ప్రజల మధ్య అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

కన్నీటిపర్యంతమైన గ్రామస్తులు

గ్రామానికి రాగానే రాజకీయాలకు అతీతంగా ప్రతీ ఒక్కరిని పలకరించే సంపత్‌రెడ్డి పటేల్ లేడంటూ గ్రామస్తులంతా మృతుడి ఇంటి వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు.

కేటీఆర్ పరామర్శ

బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు గ్రామానికి చేరుకుని సంపత్‌రెడ్డి పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంపత్‌రెడ్డి తండ్రి జయపాల్‌రెడ్డి, తమ్ముళ్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలను పరామర్శించారు. ఈక్రమంలో కూతురు సంజనను కేటీఆర్ ఓదార్చి తన చదువుకు ఎలాంటి ఆటంకం ఉండదని పూర్తి బాధ్యత తనదే అంటూ భరోసా కల్పించారు.



కుండపట్టిన తండ్రి జయపాల్‌రెడ్డి

తలకొరివి పెట్టిన తండ్రి

సంపత్‌రెడ్డికి కుమారుడు లేకపోవడంతో తండ్రి జయపాల్‌రెడ్డి తలకొరివి పెట్టాడు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య పాడె మోశారు. ఎంపీ పసునూరి దయాకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజయ్యలు కుటుంబ సభ్యులతో ఉన్నారు. ఉదయం నుంచి సత్యవతి రాథోడ్, వినయభాస్కర్, బండా ప్రకాష్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, వివిధ జిల్లాల జెడ్పీ చైర్మన్లు తదితరులు కుటుంబీకులను పరామర్శించారు.



పాడె మోస్తున్న పల్లా, రాజయ్య



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

హన్మకొండ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) వరంగల్ చైర్మన్ ఎన్.వి.వేణుగోపాలచారి పేర్కొన్నారు. వినియోగదారులకు నేరుగా సీజీఆర్‌ఎఫ్ సేవలు అందించేందుకు సెక్షన్‌ల వారీగా లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఈ లోకల్ కోర్టులు ఉంటాయని తెలిపారు. నేడు (బుధవారం) దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి సబ్ స్టేషన్‌లో లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవరుప్పుల, లింగాల ఘణపూర్, సింగరాజుపల్లి సెక్షన్ కార్యాలయ పరిధిలోని వినియోగదారులు ఈ కోర్టు ద్వారా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. రేపు (గురువారం) కరీంనగర్ జిల్లా కరీనంగర్ రూరల్ డివిజన్‌లోని గంగాధర సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో గుండి, గంగాధర్, చొప్పదండి, అర్నకొండ, అచ్చంపల్లి సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు హాజరు కావాలన్నారు. 8న పెద్దపల్లి జిల్లా రామగుండం సబ్ డివిజన్ పరిధిలోని అంతెర్గాం సెక్షన్ కార్యాలయంలో నిర్వహించే లోకల్ కోర్టులో అంతర్గాం, బసంత్‌నగర్, మేడిపల్లి, రామగుండం సెక్షన్ పరిధిలోని వినియోగదారులు హాజరు కావాలని తెలిపారు. 18న ఖమ్మం జిల్లా కొత్తలింగాల సబ్‌డివిజన్‌లోని కానేపల్లి సబ్‌స్టేషన్‌లో జరిగే లోకల్ కోర్టులో కొత్తలంగాల, కారెపల్లి, చీమలపాడు సెక్షన్ కార్యాలయాల పరిధిలోని వినియోగదారులు, 19న ఖమ్మం జిల్లా సత్తుపల్లి సబ్ డివిజన్‌లోని వేంసూర్ సెక్షన్ కార్యాలయంలో సత్తుపల్లి టౌన్, సత్తుపల్లి రూరల్, రాయుడు పాలెం, వేంసూర్ సెక్షన్ కార్యాలయాల పరిధిలోని వినియోగదారులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవచ్చని వివరించారు.

దివ్యాంగుల సేవే..విశ్వమానవ సేవ

హన్మకొండ : దివ్యాంగుల సేవే.. విశ్వమానవ సేవ అని ద నేషనల్ కన్స్యూమర్ రైట్స్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అనితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ సర్క్యూట్ గెస్ట్ హౌజ్ రోడ్డులోని స్పందన ఆశ్రమంలో అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా అనితా రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. అనితా రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల గౌరవించి వారి ఎదుగుదలకు చేయూతనివ్వాలని, హక్కులు కాపాడాలని అప్పుడే అది నిజమైన దివ్యాంగుల సంబరాలవుతాయన్నారు. మానసిక దివ్యాంగులకి అందరిలాగే వారసత్వపు హక్కు ఉంటుందని అయితే ఏమి చేసుకుంటారని తల్లిదండ్రులు మిగతా పిల్లలకు ఇచ్చినట్లుగా వారికి ఇవ్వడం లేదన్నారు. అలాగే గర్భంతో ఉన్న సమయంలో మహిళ అధిక ఒత్తిడికి గురికాకూడదన్నారు, దివ్యాంగుల ఉద్యోగాలలో మూడు శాతం రిజర్వేషన్ తప్పక అమలయ్యేలా ప్రభుత్వం చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన ఆశ్రమ నిర్వాహకురాలు సుచరిత, హరిత, కళ్యాణ్ తదితరలుపాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనితా రెడ్డి

బీఓఎస్ నియామకంలో జాప్యం

- కేయూ ఫార్మసీ కళాశాలలో పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ (బీఓఎస్) నియామకంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. రెండేళ్లుగా బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన ఆ కళాశాల ప్రొఫెసర్ స్వరూపారాణి పదవీ కాలం గతనెల 23న ముగిసింది. రెండు వారాలు కావొస్తున్నా ఆమె స్థానంలో మరో ప్రొఫెసర్‌ను బీఓఎస్‌గా నియమించలేదు. రెండేళ్లపాటు పదవీకాలం ఉంటుంది. రొటేషన్ పద్ధతిలో ప్రొఫెసర్లను నియమించాలి. స్వరూపారాణి కూడా తన పదవికాలం ముగిసిందని కూడా యూనివర్సిటీ అధికారులకు సమాచారం ఇచ్చారని తెలిసింది. పరీక్షల నిర్వహణకు సంబంధించిన పేపర్ సెట్టింగ్, ప్రశ్నపత్రాల రూపకల్పన, ప్రాక్టికల్స్‌కు ఎగ్జామినర్లకు సంబంధించిన జాబితా పరీక్షల విభాగానికి పంపించడం, జవాబుపత్రాల మూల్యాంకనం, పీహెచ్‌డీ అభ్యర్థుల వైవాకు సంబంధించి బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ విధులు కీలకంగా ఉంటాయి. అలాంటి పదవిలో అర్హులైన ప్రొఫెసర్లు ఉన్నా అధికారులు నియమించకపోవడంలో ఆంతర్యమేమిటో యూనివర్సిటీలో చర్చనీయాంశంగా మారింది. బీఫార్మసీ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ముగిశాయి. వాస్తవానికి ఆయా విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఈనెల 6 నుంచి నిర్వహించాల్సి ఉంది. కానీ, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ పదవిలో ఎవరిని నియమించకపోవడంతో ఆ పరీక్షల నిర్వహణకు అధికారులు ఉపక్రమించడం లేదు. ఎందుకంటే ప్రాక్టికల్స్‌కు ఎగ్జామినర్ల పేర్లను బీఓఎస్ పంపాల్సి ఉంటుంది. బీఓఎస్ లేకపోవడంతో ఆ ప్రాక్టికల్స్ నిర్వహించడం లేదు. త్వరలోనే ఎంఫార్మసీ పరీక్షలు ఉన్నాయి. వారికి కూడా ప్రాక్టికల్స్ నిర్వహించాలి. అలాగే, పీహెచ్‌డీ వైవాలు కూడా నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు స్పందించి ఫార్మసీ కళాశాలలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్‌గా మరో ప్రొఫెసర్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు.

నేడు 'మాస్టార్జి' సాహిత్యంపై సదస్సు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం, హైదరాబాద్ కళామండలి సంయుక్త ఆధ్వర్యంలో నేడు (బుధవారం)క్యాంపస్‌లో డాక్టర్ మాస్టార్జి సాహిత్యం సామాజికత అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించనున్నట్లు కేయూ తెలుగు విభాగం అధిపతి, డైరెక్టర్ ఆచార్య బన్న అయిలయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. సదస్సులో ముఖ్యఅతిథులుగా కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ తులనాత్మక అధ్యయన శాఖ అధ్యక్షుడు ఆచార్య గుండెడప్పు కనకయ్య కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ హిందీ విభాగం ఆచార్యులు జీవీ రత్నాకర్, ప్రముఖ న్యాయవాది తలకొక్కులరాజు, సమన్వయకర్తగా జి.రాజ్‌కుమార్ వ్యవహరిస్తారని తెలిపారు. మొదటి సమావేశంలో మాస్టార్జీ పాటలు-దళిత దృక్పథం అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ఆచార్యులు చింతకింది ఖాసీం, మాస్టార్జీ దళిత గీతాలు-మూలవాసుల సిద్ధాంతం అనే అంశంపై ప్రభుత్వ సిటీ కళాశాల అసోసియేట్ ఆచార్యులు కె.కోటేశ్వర్‌రావు, మట్టిపూలు కవిత్వం-సామాజిక స్పృహ అనే అంశంపై మద్దెర్ల రమేష్ పత్రాలు సమర్పణ చేస్తారని అయిలయ్య తెలిపారు. రెండవ సమావేశంలో మాస్టార్జీ నాటికలు -తాత్వికత అనే అంశంపై డాక్టర్ మంథిని శంకరయ్య, మాస్టార్జీ నాటకాలు-వాస్తవికత అనే అంశంపై డాక్టర్ పెద్ది వెంకటయ్య, మాస్టార్జీ కవితలు-సామాజికత అనేఅంశంపై డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, తాళ్లపెల్లి యాకమ్మ, డాక్టర్ ఎస్ కోమల మాస్టార్జీ సాహిత్యంలో స్త్రీ పాత్రచిత్రణ అనే అంశాల పత్రాలను సమర్పిస్తారని తెలిపారు. సాయంత్రం ఈసదస్సు ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, గౌరవ అతిథులుగా బహుజన రచయితల సంఘం ఖమ్మం అధ్యక్షుడు కె సీతారాములు, కేయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి, ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి డాక్టర్ సురభి లక్ష్మిశారద, ప్రముఖ రచయిత్రి జి.శాంతకుమారి పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

వాహనం ఢీకొని ఒకరి మృతి



నర్సంపేట రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన నర్సంపేట మండలంలోని రాజుపేట శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామ శివారులో 365 జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. అటువైపు వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకోని మృతదేహాన్ని 108లో నర్సంపేట పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియ రాలేదు. సమీప గ్రామస్తులు మాత్రం యాచకుడని, మానసిక స్థితి బాగా లేదని కొందరు అంటున్నారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఏదో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందని చర్చించుకుంటున్నారు. ఈఘటనపై ఎస్సై శీలం రవిని వివరణ కోరగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన విషయం వాస్తవమేనని, మృతుడు ఎవరు అనేది తెలియాల్సి ఉందన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



బాబురావు(ఫైల్)

సంగెం : ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బాధతో వ్యక్తి ఆత్మహత్య యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం మండలంలోని తీగరాజుపల్లి గ్రామానికి చెందిన కర్నుగుత్త బాబురావు(55)కు ఐదు ఎకరాల వ్యవసాయభూమి ఉంది. కాగా రెండేళ్ల క్రితం ఇల్లు నిర్మించాడు. ఇందుకు సమీప బంధువుల వద్ద రూ.5లక్షలు అప్పు తీసుకున్నాడు. పంటలు పండకపోవడంతో అప్పు తీర్చలేదు. ఈ క్రమంలో క్షణికావేశానికి గురైన బాబురావు సోమవారం తెల్లవారుజామున పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ఎంజీఎంకు తరలించారు. బాబురావు పరిస్థితి విషమించడంతో హనుమకొండలోనిమో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య రమ ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.భరత్ పేర్కొన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

కొత్తగూడ : మండలంలోని చెరువుముందు తండా, బోటిమీది తండా మధ్యలో గల ఒంటిగుడిసె సమీపంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. కాకతీయ కాలం నాటి ఆనవాళ్లు, విగ్రహాలు బయట పడుతుండటంతో ఈప్రాంతం పై గుప్త నిధుల ముఠా కన్నుపడింది. ఓ ప్రజాప్రతినిధి కుమారుడు కొందరి సహకారంతో తవ్వకాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. వరంగల్ పట్టణ ప్రాంతం నుంచి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఈ ప్రాంతంలోని ఓరైతు పొలంలో గుప్త నిధులు ఉన్నాయని గుర్తించినట్లు సమాచారం. నంది విగ్రహం, పాతకాలం నాటి ఇటుకలు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఈప్రాంతం పై అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.